గోవిందరాజుకు ఉత్తమ సేవా పురస్కారం

ప్రజాశక్తి - పెరవలి

మండలంలోని కాకపర్రుకు చెందిన లైన్‌మ్యాన్ కవురు గోవిందరాజుకు బెస్ట్ లైన్‌మ్యాన్ పెర్ఫామెన్స్ అవార్డు దక్కింది. నిడదవోలు డివిజనల్ ఇంజినీర్ కార్యాలయంలో మంగళవారం లైన్‌మ్యాన్ దివసన్ను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గోవిందరాజులు డిఇ ఎన్.నారాయణఅప్పారావు నుంచి అవార్డును అందుకున్నారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు, సర్పంచ్ గుబ్బల ఆదిలక్ష్మి, సంగీత నాగు పెనుమత్స మధు, జి.రంగారావు తదితరులు అభినందించారు.

భానుడి భగభగ

- క్రమంగా పెరుగుతున్న పగటి ఉష్ణోగ్రతలు
- రానున్న రోజుల్లో మరింత పెరిగే అవకాశం

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి

వేసవి పూర్తిగా రాకముందే జిల్లాలో ఎండల తీవ్రత ఒక్కసారిగా పెరిగింది. గడిచిన రెండు వారాలుగా రోజురోజుకు భానుడు భగ భగమంటున్నాడు. ఫిబ్రవరి రెండో వారం నుంచే ఎండల తీవ్రత ప్రారంభమైంది. మార్చినాటికి ఇవి మరింత ముదిరాయి. ఇక ఎలా ఉండబోతోందనే జనం బెంబేలెత్తుతున్నారు. మరో పక్క రాత్రి వేళలో పొద్దుపోయిన తర్వాత చలి తీవ్రత ఎక్కువగా ఉంటుంది. ఈ విచిత్ర వాతావరణంలో జనం ఉక్కిరి బిక్కిరి అవుతున్నారు. వృద్ధులు, చిన్నారులు వివిధ రోగాల బారిన పడుతున్నారు. ఈ ఏడాది ఎండలు ఎక్కువ ఉంటాయనే వాతావరణ హెచ్చరికలతో మరింత ఆందోళన పెరిగింది.

36 డిగ్రీలు దాటిన ఉష్ణోగ్రతలు

జిల్లాలో పగటి ఉష్ణోగ్రతలు 36 డిగ్రీలు దాటి నమోదవుతున్నాయి. మొదటి వారంలోనే పలుప్రాంతాల్లో 38 డిగ్రీల వరకూ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. మరో పక్క ఉక్కపోత ప్రజలను కుదురుగా ఉండనీయట్లేదు. జిల్లాలో ఎండల తీవ్రత పెరగడంతో ఎసిలు, కూలర్ల వినియోగం పెరిగింది. చాలా మంది తమ ఇళ్లలో ఉన్న ఎసిలకు సర్వీసింగ్ చేయిస్తున్నారు. వీటితో పాటు కూలర్లు కూడా రిపేరు చేయించుకుంటున్నారు. అలాగే ఎత్తయిన భవనానల్లో ఉండేవాళ్లు కూల్ పేయింట్లను వేసుకునేందుకు సిద్ధం అవుతున్నారు. గ్రామాల్లో కూడా జనం ఇళ్లపైన ఆరుబయట పడుకోవటం ఆరంభించారు. మార్చి చివర నాటికి 40 డిగ్రీల ఉష్ణోగ్రతలు పెరిగే అవకాశం ఉంది. గత ఏడాది ఇదే సమాయానికి ఇంత ఎండలేదని ఈ సారి భానుడు భగ భగమంటున్నాడని ప్రజలు ఆందోళనవ్యక్తం చేస్తున్నారు.

విద్యార్థులు ఉక్కిరి బిక్కిరి ఈ ఎండల తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో మార్చి 1వ తేదీ నుంచి ఇంటర్ పరీక్షలు ప్రారంభం అయ్యాయి. దీంతో మధ్యాహ్నం విద్యార్థులు తిరుగు ప్రయాణంలో అవస్థలు పడుతున్నారు. అలాగే ఈ నెల 17 నుంచి పదో తరగతి పరీక్షలు ప్రారంభం కానున్నాయి. బాగా ఎండల తీవ్రత పెరుగుతున్న సమయంలో పరీక్షలు ప్రారంభం కావటంతో పిల్లలు కూడా తగిన జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. పరీక్షలు ఉదయమే ప్రారంభం అవుతాయి కనుక ఎండ తీవ్రత కొద్దిగా తక్కువ ఉన్నా పరీక్ష ముగిసే సమయానికి మాత్రం ఎండలు అదరగొట్టే అవకాశం ఉంటుంది. తగిన జాగ్రత్తలు తీసుకుంటూ పరీక్షలకు సిద్ధమవ్వాలని వైద్యులు సూచిస్తున్నారు.

తేదీ	కనిష్టం	గరిష్టం
ఫిబ్రవరి 27	18.4	36.6
ఫిబ్రవరి 28	21.0	35.6
మార్చి 1	21.8	38.8
మార్చి 2	20.9	36.2
మార్చి 3	21.7	35.4
మార్చి 4	22.0	38.0

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

- బయటకు వెళ్లేటపుడు తప్పకుండా గొడుగు లేదా టోపీ వాడాలి
- తెలుపు రంగు, పలుచటి దుస్తులు, లూజుగా కాటన్ దుస్తులను ధరించాలి
- ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 4 గంటల మధ్యలో ఆరుబయట తిరుగకూడదు.
- వీలైనన్ని సార్లు నీరు తీసుకోవాలి. ఎండలో తిరిగే సమయంలో కొబ్బరి నీరు, మజ్జిగ, నీటిలో నిమ్మరసం, కాస్తంత ఉప్పు కలిపిన ద్రావణాన్ని తీసుకోవాలి.
- ఎండలో బయటకు వెళ్లినపుడు తల తిరగడం వికారంగా ఉండటం జరిగితే తక్షణమే వైద్యులను సంప్రదించాలి.

పేరాబత్తుల విజయం

- దాదాపు 30 గంటలు సాగిన ఓట్ల లెక్కింపు
- 77,461 ఓట్ల మెజార్టీతో గెలుపు

విజయ సంకేతం చూపుతున్న పేరాబత్తుల రాజశేఖరం

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాల పట్టభద్రుల ఎంఎల్‌సి ఎన్నికల్లో టిడిపి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖరం విజయం సాధించారు. తొలి ప్రాధాన్యత ఓటుతోనే విజయం సొంతం చేసుకున్నారు. ప్రత్యర్థి పిడిఎఫ్ అభ్యర్థి దిడ్ల వీరరాఘువులుపై 77,461 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. పట్టభద్రుల ఎంఎల్‌సి ఎన్నికల్లో గెలుపుతో కూటమి శ్రేణుల్లో ఆనందోత్సాహాలు వెల్లివిరిశాయి. ఫిబ్రవరి 27న ఎన్నికల పోలింగ్ జరగ్గా మొత్తం 3,14,984 ఓట్లకుగాను 2,18,902 ఓట్లు పోలయ్యాయి. ఈ నెల మూడో తేదీ ఉదయం ఎనిమిది గంటలకు కౌంటింగ్ ప్రక్రియను అధికారులు ప్రారంభించారు. దాదాపు 12 గంటలపాటు ఓట్లు కట్టలు కట్టడమే సరిపోయింది. 16 గంటల తరువాత తొలి రౌండ్ ఫలితాలు వెల్లడించారు. దాదాపు 30 గంటల తర్వాత నాలుగో తేదీ మధ్యాహ్నం రెండు గంటలకు కౌంటింగ్ ప్రక్రియ పూర్తయ్యింది.

తొలి ప్రాధాన్యతా ఓట్లతోనే టిడిపి అభ్యర్థి గెలుపు

ఎంఎల్‌సి ఎన్నికల్లో పోస్టల్ ఓట్లతో కలిపి మొత్తం 2,18,997 ఓట్లు పోలైనట్లు అధికారులు తేల్చారు. ఓట్ల లెక్కింపు ప్రక్రియ చేపట్టగా 19,789 ఓట్లు చెల్లనివి తేలాయి. చెల్లుబాటు ఓట్లు 1,99,208గా తేల్చారు. తొలి ప్రాధాన్యత ఓట్ల లెక్కింపులో గెలుపు సాధించాలంటే 99,604 ఓట్లు రావాల్సి ఉండగా టిడిపి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖరానికి మొత్తం 1,24,702 ఓట్లు వచ్చాయి. ఏడో రౌండ్‌లోనే టిడిపి అభ్యర్థి గెలుపునకు సంబంధించిన మ్యాజిక్ ఫిగర్‌ను దాటేశారు. పిడిఎఫ్ అభ్యర్థికి ఈ ఎన్నికల్లో మొత్తం 47,241 ఓట్లు వచ్చాయి.

ఓటింగ్ ప్రక్రియపై అవగాహనలో అధికారులు విఫలం

ఎంఎల్‌సి ఎన్నికల్లో ఓట్లు వేసే అంకెలపై అధికారులకు, ఏజెంట్లకు మధ్య మూడో తేదీ రాత్రి వాగ్వివాదం చోటుచేసుకుంది. నిబంధనల ప్రకారం అభ్యర్థి పేరు ముందు బాక్సులో ఒకటి మాత్రమే వేయాలని, రోమన్ అంకెలు వేయకూడదని, అలా వేస్తే చెల్లదని చెబుతూ వచ్చారు. కానీ కౌంటింగ్ ప్రక్రియలో మాత్రం రోమన్ అంకె ఒకటి వేసినా చెల్లుబాటు అవుతుందని తేల్చారు. అదేవిధంగా ఒకటి అంకె తప్ప గడిలో మరేమీ వేయకూడదని ప్రచారంలో అభ్యర్థులు సైతం ఓటర్లకు తెలిపారు. ఒకటికి ముందు జీరో వేసినా ఓటు చెల్లుబాటు అవుతుందని కౌంటింగ్‌లో అధికారులు పేర్కొన్నారు. అదేవిధంగా ఒకటి వేసి ఒకటి చుట్టూ సున్నా చుట్టినా ఓట్లు చెల్లుబాటు అవుతాయని చెప్పడంపై పలువురు అభ్యర్థులకు సంబంధించిన ఏజెంట్లు అభ్యంతరం తెలిపారు. ఎన్నికల ముందు అభ్యర్థులతో జరిగిన సమావేశాల్లో ఓటింగ్ ప్రక్రియపై అధికారులు సరైన అవగాహన కల్పించకపోవడం వల్లే ఇది జరిగిందనే విమర్శలు వెల్లువెత్తాయి. ఎన్నికల నిబంధనావళి బుక్‌లో ఉన్నట్లు అధికారులు చెప్పడం విశేషం.

కూటమిపై నమ్మకమే గెలుపునకు కారణం

పేరాబత్తుల రాజశేఖరం

కూటమి ప్రభుత్వంపై ప్రజల్లో ఉన్న నమ్మకమే ఈ గెలుపునకు కారణం. ఎన్నికల రోజు లోకేష్ నిరంతరం ప్రత్యేకంగా పర్యవేక్షిస్తూ ముందుకు నడిపించారు. అందరినీ ఏకతాటిపైకి తెచ్చి గెలుపునకు లోకేష్ ఎనలేని కృషి చేశారు. మొదటి ప్రాధాన్యత ఓటుతో గెలవడం ఆనందంగా ఉంది. పట్టభద్రులు, ఉద్యోగులు సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా. నా గెలుపునకు కృషి చేసిన నేతలకు కృతజ్ఞతలు తెలుపుతున్నాను.

సహకరించిన ప్రతిఒక్కరికీ కృతజ్ఞతలు

దిడ్ల వీరరాఘవులు, పిడిఎఫ్ అభ్యర్థి

ఎంఎల్‌సి అభ్యర్థిగా నామినేషన్ ఘట్టం నుంచి చివరి వరకూ నాకు మద్దతు తెలిపి ఓటేసిన పట్టభద్రులకు, నా ప్రచారంలో పాల్గొని సహకరించిన శ్రేణులకు అందరికీ కృతజ్ఞతలు. భవిష్యత్తులోనూ ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, మహిళల, యువత పక్షాన పోరాటం కొనసాగుతోంది.

ఉపాధి పనుల పరిశీలన

ప్రజాశక్తి - తాళ్లపూడి

భూగర్భ జలాల నిల్వలు పెంచితే ఉద్యానవన పంటలకు ఎంతో మేలు జరుగుతుందని, ఉపాధి పథకం ద్వారా రైతాంగానికి ఉపయోగపడే పలు పనులు చేపడుతున్నామని ఎన్‌ఆర్‌జిఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ నాగమహేశ్వరరావు అన్నారు. మంగళవారం ఆయన తాళ్లపూడి మండలంలో పర్యటించారు. మండలంలో జరుగుతున్న ఉపాధి ఎ నంలనం వరిశీలించారు. పోచవరం గ్రామంలో జరుగుతున్న నీటి గుంటల అభివృద్ధి, ఉద్యానవన పంట అయిన జీడి మామిడి మొక్కల చుట్టూ నీరు చేరేందుకు పళ్లాలు ఏర్పాటు, మండలానికి కేటాయించిన అమృత్ సరోవర్ ట్యాంక్ నిర్మాణం పనులను పరిశీలించారు. పని దినాలు పెరిగేలా కార్యాచరణ రూపొందించాలని సిబ్బందికి సూచించారు. ఆయన వెంట ఎపిడి రామ్ ప్రసాద్, ఎపిఒ సిఎస్.రమాదేవి, సిబ్బంది ఉన్నారు.

ఉపాధి పనులను పరిశీలిస్తున్న అధికారులు

క్యాండిల్ ర్యాలీతో మహిళా చట్టాలపై అవగాహన

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం రూరల్

మహిళా చట్టాలపై అవగాహన కల్పించేందుకు మంగళవారం క్యాండిల్ ర్యాలీని నిర్వహించారు. స్థానిక సరస్వతి ఘాట్ నుంచి కోటిపల్లి బస్టాండ్ వరకు నిర్వహించిన క్యాండిల్ ర్యాలీకి డిఎల్‌ఎస్‌ఎ కార్యదర్శి ఎస్.శ్రీలక్ష్మి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా శ్రీలక్ష్మి మాట్లాడుతూ మహిళల రక్షణ కోసం ఎన్నో కార్యక్రమాలను చేపడుతున్నామన్నారు. వాటిని ఆకలింపు చేసుకుని రక్షణ పొందాలని మహిళలకు సూచించారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం వేడుకలను పురస్కరించుకుని జిల్లా స్థాయిలో వివిధ కార్యక్రమాలు చేపట్టడం పట్ల జిల్లా యంత్రాంగాన్ని ప్రత్యేకంగా అభినందించారు. సమాజంలో చైతన్యం తీసుకొచ్చినప్పుడే మహిళలపై హింసలను అరికట్టగలుగుతామని తెలిపారు. మన తల్లి సోదరి బిడ్డ కూడా ఆడపిల్ల అన్న విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తెరిగి ప్రవర్తించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా స్త్రీ శిశు సంక్షేమ శాఖ అధికారి కె.విజయకుమారి, డిఎస్‌పిలు భవ్యకిశోర్, బి.విద్య, మహిళా పోలీసు సిఐ మంగాదేవి, ఎస్ఐ అమీనా బేగం, సిడిపిఒ బేబిరాణి, మహిళలు, విద్యార్థినులు ఈ ర్యాలీలో పాల్గొన్నారు.

ఉత్సాహంగా నారీ ఫెస్ట్

ప్రజాశక్తి - రాజానగరం

నన్నయ యూనివర్శిటీ కన్వెన్షన్ సెంటర్‌లో నారీ ఫెస్ట్ మంగళవారం ఉత్సాహభరిత వాతావరణంలో ప్రారంభమైంది. ముఖ్యఅతిథిగా విసి ఎస్.ప్రసన్నశ్రీ హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా విసి మాట్లాడారు. మనిషికి ఎన్ని డిగ్రీలు ఉన్నా ప్రేమ, అనురాగం, ఆప్యాయత, ఆదరణ, మానవ విలువలు లేకపోతే అన్ని వృథాయే అన్నారు. గతంలో మహిళలు ఎన్నో వివక్షతను ఎదుర్కొనే వారన్నారు. నేటి సమాజంలో కొంత మార్పు వచ్చిందన్నారు. భవిష్యత్‌లో వివక్షత లేని సమాజం వైపు అడుగులు వేయాలన్నారు. ఆకాశంలో సగం, అవకాశంలో సగం మాత్రమే కాదు ఆధరించడంలో సగం కావాలన్నారు. ఆధరణే ఆధారం, మహిళలు ఆదరణను కోరుకుంటారని, అటువంటి ఆదరణ తల్లిదండ్రుల నుంచి, జీవిత భాగస్వామి నుంచి, పిల్లల నుంచి, గురువుల నుంచి, స్నేహితులు, సన్నిహితుల నుంచి లభిస్తుందన్నారు. మానవ విలువలు పెంపొందించుకోవాలన్నారు. విశ్వవిద్యాలయం మామ్మ మనవరాలు ఫ్యాషన్ షో నిర్వహిస్తున్నామని, మామ్మ తరం నుండి మనవరాలు తరం వరకు బంధంతో పాటు సంస్కృతి, సంప్రదాయాలు కొనసాగాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామన్నారు. మామ్మ మనవరాలు చెయ్యి పట్టుకొని నడుస్తుంటే మామ్మ స్ఫూర్తిని మార్గదర్శకంగా తీసుకున్న మనవరాలు కనిపిస్తుందన్నారు. పెద్దలను గౌరవించాలని, అనాథ ఆశ్రమాలు లేని సమాజం వైపు పయనించాలని సూచించారు. ఈ మూడు రోజుల పోటీల్లో అందరూ ఉత్సాహంగా పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. అనంతరం వివిధ కేటగిరీలకు చెందిన మహిళలను, శిశువులను వేదికపైకి పిలిచి బుడగలు వదిలి పోటీలు ప్రారంభించారు. గ్రూప్ సింగింగ్, గ్రూప్ డ్యాన్స్, ఫ్యాషన్ షో, స్కిట్స్, మామ్మ మనవరాలు ఫ్యాషన్ షో, హెల్దీ బేబీ పోటీలు నిర్వహించారు. ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంతో పాటు అనుబంధ కళాశాలలు, స్థానిక మహిళలు ఈ కార్యక్రమానికి పెద్ద ఎత్తున హాజరయ్యారు. అలాగే స్థానిక పాఠశాలల విద్యార్థులకు చిత్రలేఖనం, వ్యాసరచన, వక్తృత్వ పోటీలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉమెన్స్ సెల్ కో-ఆర్డినేటర్ డాక్టర్ పి.ఉమామహేశ్వరిదేవి, ప్రెసిడింగ్ ఆఫీసర్ డాక్టర్ వి.పెర్సిస్, ఛీఫ్ పెట్రన్ డాక్టర్ ఎన్.సజనారాజ్, సెక్రటరీ డాక్టర్ కె.దీప్తి, జాయింట్ సెక్రటరీ డాక్టర్ డి.లత, ట్రెజరర్ డాక్టర్ బి.విజయకుమారి, స్పెషల్ అడ్వయిజరీ కమిటీ మెంబర్స్ డి.జ్యోతిర్మయి, డాక్టర్ పి.విజయనిర్మల, డాక్టర్ కె.సుబ్బారావు, డాక్టర్ కె.నూకరత్నం, డాక్టర్ పద్మావతి, డాక్టర్ కె.రమణేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

రేపు అనుబంధ కళాశాలల సిబ్బందికి పోటీలు..

5వ తేదీన ఆదికవి నన్నయ యూనివర్సిటీ మరియు అనుబంధ కళాశాలల మహిళా సిబ్బందికి వివిధ పోటీలు నిర్వహిస్తున్నట్టు నారీ ఫెస్ట్ నిర్వాహకులు తెలిపారు. సృజనాత్మక చేతిపనులు, చిరుధాన్యాలతో ఆహార పదార్థాలు తయారీ, పూల అలంకరణ వంటి పోటీలు జరుగుతాయన్నారు. ఈ పోటీల్లో పాల్గొనేందుకు రూ.100 చెల్లించి రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు.

చివరి రోజు నారీ ఫెస్ట్ వేడుకలు

ఆఖరి రోజు 6న ఆదికవి నన్నయ యూనివర్సిటీ కన్వెన్షన్ సెంటర్లో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకను ఘనంగా నిర్వహిస్తామని విసి తెలిపారు. విశ్వవిద్యాలయం నిర్వహించిన వివిధ పోటీలలో విజేతలకు నారీ ఫెస్ట్ కార్యక్రమంలో విజేతలకు జ్ఞాపికలు, సర్టిఫికెట్లను అందిస్తామన్నారు. ఈ వేడుకల్లో వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయన్నారు. యూనివర్సిటీ ఉమెన్స్ సెల్ ఆధ్వర్యంలో జరుగుతాయన్నారు.

చిన్నారితో కలిసి జ్యోతిప్రజ్వలన చేస్తున్న విసి ప్రసన్నశ్రీ

పారిశుధ్యంపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

పారిశుధ్యంపై దృష్టి సారించాలి

ప్రజాశక్తి - చాగల్లు

గ్రామాల్లో పారిశుధ్యంపై పంచాయతీ కార్యదర్శులు దృష్టి సారించాలని ఇఒపిఆర్‌డి ఆర్.శ్రావణ్‌కుమార్ సిబ్బందికి సూచించారు. మండలంలో పారిశుధ్యంపై స్పెషల్ డ్రైవ్‌ను మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని ఆయా గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శుల ఆధ్వర్యంలో మంగళవారం ఉదయం ఐదున్నర గంటల నుంచి స్థానిక క్లాప్ వాహనాల ద్వారా ప్రతి ఇంటి నుంచి చెత్తను సేకరించి సంపద తయారీ కేంద్రాలకు తరలించారన్నారు. గ్రామస్తులు తడి, పొడి చెత్తను వేరువేరుగా చెత్తకుండీలో వేయాలని సూచించారు. అనంతరం బిన్, బ్యాగ్ వ్యవస్థ గురించి స్థానిక మహిళలకు వివరించారు. నేలటూరులో చెత్త సేకరణ పనులను తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, సచివాల సిబ్బంది పాల్గొన్నారు.

లైంగిక వేధింపు చట్టాలపై అవగాహన

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం రూరల్

స్థానిక ఎస్‌పి కార్యాలయంలో మంగళవారం మహిళ దినోత్సవ వారోత్సవాలు సందర్భంగా మహిళ స్త్రీ శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మహిళలపై లైంగిక వేధింపు చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా జిల్లా న్యాయ సేవధికార సంస్థ సెక్రటరీ, సీనియర్ సివిల్ జడ్జి శ్రీలక్ష్మి హాజరయ్యారు. ఆమె మాట్లాడుతూ 1987లో సుప్రీం కోర్టులో పేద బడుగు బలహీన వర్గాలకు, మహిళలకు, వృద్ధులకు ఉచిత న్యాయ సేవలనందించాలనే ఆశయంతో న్యాయ సేవాధికార సంస్థను ఏర్పాటు చేశారన్నారు. చట్టాలపై అవగాహన కల్పించి, బాధితులకు న్యాయం చేకూరే విధంగా, అందరూ సహకరించాలని మహిళా రక్షక కానిస్టేబుల్స్‌కు సూచించారు.

ఎస్‌పి డి.నరసింహకిషోర్ మాట్లాడుతూ అనుకోని సంఘటన జరగక ముందే, ముందు జాగ్రత్తగా మహిళా రక్షక కానిస్టేబుల్స్, అనుమానితులకు హెచ్చరికలు చేయాలన్నారు. మహిళల రక్షణ కోసం రూపొందించిన గృహ హింస చట్టం-498ఎలో ఉద్దేశించిన విస్తృన్యాయన్ని, బాధిత మహిళలకు అందించాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. ఎన్ని చట్టాలు చేస్తున్నా, మహిళలకు ఆశించినంత స్థాయిలో అందించలేక పోవడం పట్ల ఆయన ఆవేదన వ్యక్తపరిచారు. మహిళల రక్షణ కోసం జిల్లాలో ప్రత్యేక మహిళ రక్షక దళం ఎర్పాటు చేసుకున్నట్లు తెలిపారు. జిల్లా శిశు మహిళా అధికారి కె.విజయ్ కుమారి మాట్లాడుతూ అనాథలు, మహిళల రక్షణ కోసం ప్రతీ మండలంలో తమ సిబ్బంది అవగాహన కల్పించడంతో పాటు రక్షణ ఇస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో పోలీస్ అధికారులు, మహిళా రక్షక కానిస్టేబుల్స్, లీగల్ వాలంటీర్స్, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

మోటార్ మెకానికల్ వర్కర్స్ అధ్యక్షునిగా కట్టా

ప్రజాశక్తి-కోరుకొండ

కోరుకొండ మోటార్ మెకానికల్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షునిగా కట్టా సత్తిబాబు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మంగళవారం కోరుకొండలో జరిగిన సమావేశంలో కట్టా సత్తిబాబును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా దేవి వెంకట మణిసాయి మోటార్ మెకానికల్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడుగా కట్టా సత్తిబాబు ఏకగ్రీవంగా ఎన్నిక కావడంతో టీడీపీ నాయకులు తెలగంశెట్టి శ్రీను, రొంగల శ్రీను, పరస శ్రీను అభినందనలు తెలిపారు.

కార్టూ'నిజం'



ఇసుక ర్యాంపులపై ప్రజాభిప్రాయ సేకరణ

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని కాటవరం, సింగవరం సచివాలయాల్లో జాయింట్ కలెక్టర్ చిన్నరాముడు ఇసుక ర్యాంపులు కేటాయింపులపై మంగళవారం ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించారు. కాటవరంలో ఇసుక ర్యాంపు సింగవరం ర్యాంప్ నుంచి వెళ్లే ఇసుక లారీల వల్ల పంటలు పాడైపోతున్నాయని, సింగవరం నుంచి కాకుండా వంగలపూడి ర్యాంప్ నుంచి ఇసుక తీసుకువెళ్లాలని రైతులు కోరారు. ఇది ఇలా ఉండగా ఇసుక ర్యాంపులకు అనుమతి ఇవ్వకూడదని ఫిబ్రవరి 17న తూర్పుగోదావరి జిల్లా కలెక్టర్‌కు, మైన్ ఎడికి, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఇంజినీర్‌కు కొంత మంది ఫిర్యాదు చేశారు. నవంబర్ 2022 నుంచి ఆగస్టు 2024 వరకు సీతానగరం మండలం మునికూడలి గ్రామం, తాళ్లపూడిలోని ప్రక్కిలంక గ్రామ సరిహద్దులో విస్తతంగా జరిగిన అక్రమ ఇసుక తవ్వకాలపై ఫిర్యాదు చేసినా పట్టించుకోకుండా వదిలేశారని పలువురు తెలిపారు. ఎలాంటి అనుమతులు లేకుండానే ఈ చట్టవ్యతిరేక కార్యకలాపాలు సాగుతున్నాయి. ఈ విషయమై పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకోలేదని పలువురు వాపోయారు. ఇసుక అక్రమ తవ్వకాలు యథేచ్ఛగా సాగుతున్నప్పటికీ అలాంటి కార్యకలాపాలేమీ జరగడం లేదని నివేదికలు సమర్పించడం చాలా అనుమానాస్పదంగా ఉందన్నారు. అంతేకాకుండా, అక్రమ ఇసుక తవ్వకాలకు పాల్పడుతున్న వ్యక్తులను స్థానిక రైతులు ప్రశ్నించగా, మైనింగ్‌కు కారణమైన కంపెనీ ఉద్యోగులు సీతానగరం పోలీస్ స్టేషన్‌లో రైతులపై ఫిర్యాదు చేశారు. బర్ల వే బ్రిడ్జి లీజు చెల్లింపుల వివాదం కారణంగా తమను బర్ల బాబురావు బెదిరించి అడ్డుకున్నారని జెపి కంపెనీ ఉద్యోగులు ఫిర్యాదు చేశారు. ఇసుక అక్రమ తవ్వకాల వల్లే ఈ కేసులు పెట్టినట్టు తెలిపారు. ఫిర్యాదుదారుల సమాచారం ఆధారంగా పోలీసులు జరిపిన విచారణలో జె.పి సంస్థ నిజంగానే అక్రమ ఇసుక తవ్వకాలకు పాల్పడి ప్రభుత్వ ఆదాయానికి గండికొట్టినట్టు తేలిందన్నారు. రెండేళ్లుగా సాగుతున్న అక్రమ ఇసుక తవ్వకాల వల్ల పర్యావరణానికి తీవ్ర నష్టం వాటిల్లిందని, ఇసుక ర్యాంపుల దీర్ఘకాలిక పరిణామాల గురించి తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ప్రక్కిలంక సర్వే నంబర్‌లో భవిష్యత్తులో ఇసుక తవ్వకాలకు అనుమతులు మంజూరు చేయడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. జెపి కంపెనీ అక్రమ కార్యకలాపాలు, అప్పటి మైనింగ్ ఎడి ఎం.సుబ్రహ్మణ్యం చేసిన నిర్లక్ష్యంపై సమగ్ర దర్యాప్తు చేయాలని కోరారు. ఈ చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడిన వారందరిపై తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాలని, ఇకపై పర్యావరణానికి నష్టం జరగకుండా చూడాలన్నారు. ప్రస్తుతం ఇసుక ర్యాంపులకు అనుమతి ఇవ్వకూడదని ఫిర్యాదు చేశారు.

ప్రజాభిప్రాయ సేకరణలో మాట్లాడుతున్న మైనింగ్ ఎడి

దాళ్వాకు సాగు నీరు అందించాలి

కోటిపల్లి ఇరిగేషన్ కార్యాలయం వద్ద సాగునీటి కోసం రైతులు ఆందోళన

ప్రజాశక్తి - రామచంద్రపురం

దాళ్వాకు అవసరమైన సాగునీరు అందించాలని కోటిపల్లి నీటి పారుదల శాఖ కార్యాలయం వద్ద మంగళవారం రైతులు ఆందోళన కార్యక్రమం చేపట్టారు. పామర్రు కోటిపల్లి, దంగేరు, కోట, మసకపల్లి గ్రామాలకు సాగునీరు సక్రమంగా అందక రైతులు ఇక్కట్లకు గురవుతున్నారని ఈ సందర్భంగా రైతులు తెలిపారు. రైతులు మాట్లాడుతూ 17 వేల ఎకరాలు పంట పొలాలు ఉన్న తాళ్లరేవుకి 5 రోజులు వంతు ఇస్తున్నారని, అదే మసకపల్లి లాకు కింద 18 వేల ఎకరాలకు పంట భూములకు కేవలం 2 రోజులు వంతు మాత్రమే ఇస్తున్నారని దీనితో సాగు నీరు సరిపోక పంట పొలాలు ఎండిపోతున్నాయని రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మసకపల్లి లాకుకి కూడా వంతు పెంచాలని వారంతా డిమాండ్ చేశారు. కోటిపల్లి, కోట, దంగేరు, పల్లిపాలెం నీటి సంఘాల నాయకులు రైతులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఇంతవరకే ఇరిగేషన్ కార్యాలయంలో అధికారులు లేకపోవడంతో వారంతా వెనుదిరిగారు. వెంటనే సాగునీటి సాంద్రతను పెంచి పంటపొలాలను రక్షించాలని వారంతా ఇరిగేషన్ అధికారులను విజ్ఞప్తి చేస్తున్నారు.

డిఇ వివరణ

ఇరిగేషన్ డిఇ వెలగా రామకృష్ణ ను సాగునీటి కోసం వివరణ కోరగా ప్రస్తుతం అన్ని పంట కాలువలను పరిశీలిస్తున్నామని ఇప్పటికే తక్కువ సరఫరా ఉన్న కాలువలకు నీటి సాంద్రత పెంచ డం జరిగిందని, కోటిపల్లి నుండి తాళ్లరేవు వరకు గల కాలువలను పరిశీలించి తగు చర్యలు తీసుకుంటామని ప్రజాశక్తికి వివరించారు.

తాగు, సాగునీటి సమస్యను పరిష్కరించాలి

ఉప్పలగుప్తం: వేసవి ప్రారంభంలోనే తీర గ్రామాల ప్రజలు తాగునీటి కష్టాలు ఎదుర్కొంటున్నారని, అలాగే రైతులు సాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ప్రభుత్వం తక్షణం స్పందించి సమస్య పరిష్కరించాలని రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా(అథవాలే)జాతీయ కార్యదర్శి డి.వి.లోక్ డిమాండ్ చేశారు. మండలంలోని తీర గ్రామాలలో మంగళవారం ఆర్పిఐ కార్యకర్తలతో లోక్ పర్యటించారు. ప్రజల ఎదుర్కొంటున్న తాగునీటి కష్టాలు అలాగే గ్రామాల్లో రైతులు ఎదుర్కొంటున్న సాగునీటి ఇబ్బందుల గురించి వారితో మాట్లాడారు. అనంతరం లోక్ విలేకరులతో మాట్లాడారు.ప్రజలు ఎదుర్కొంటున్న తాగునీటి సమస్య పరిష్కరించడంలోనూ రైతుల ఎదుర్కొంటున్న సాగునీటి సమస్యను పరిష్కరించడంలోనూ పాలకులు పూర్తిగా విఫలమయ్యారని ఆరోపించారు. ఇది ప్రజా వ్యతిరేక ప్రభుత్వం అని ఆయన విమర్శించారు. తీర గ్రామ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తక్షణం పరిష్కరించాలని లేనిపక్షంలో ప్రజా రైతు ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. సమావేశంలో ఆర్పిఐ నాయకులు పెయ్యల పరశురాముడు, కొంకి వెంకట బాబ్జి, దోని పాటి ఆంజనేయులు, పండు రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

పశువుల పాక దగ్ధం

ప్రజాశక్తి - సామర్లకోట

వివి.రాయపురం గ్రామంలో ఒక పశువుల పాక దగ్ధం అయింది. గ్రామానికి చెందిన రంగనాథం వీరభద్రరావుకు చెందిన పశువుల పాకలో సోమవారం రాత్రి మూడు గేదెలు, రెండు లేగ దూడలను కట్టారు. ఆ పాక దగ్ధం అయింది. ఈ ప్రమాదంలో ఒక గేదె మృతి చెంగా, మిగిలిన పశువులకు గాయాలయ్యాయి. అగ్ని ప్రమాదానికి కారణం తెలియాల్సి ఉంది.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

ప్రజాశక్తి - పెద్దాపురం

కాకినాడ ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న గుర్తు గుర్తి తెలియని వ్యక్తి ఆరోగ్యం విషమించి మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. పెద్దాపురం దర్గా సెంటర్-కాండ్రకోట రహదారి పెట్రోల్ బంక్ సమీపంలో డ్రయినేజీ వద్ద గుర్తు తెలియని వ్యక్తి అపస్మారక స్థితిలో ఉండగా చుట్టుపక్కల వారు అతనిని ఈ నెల 2వ తేదీన జిజిహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతున్న ఆ వ్యక్తి ఆరోగ్యం విషమించి సోమవారం రాత్రి మృతి చెందాడని పోలీసులు తెలిపారు. ఎస్ఐ వి.మౌనిక కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఏప్రిల్ 30న పాలిసెట్ ప్రవేశ పరీక్ష

ప్రజాశక్తి - పిఠాపురం

పాలిటెక్నికల్ ప్రవేశ పరీక్ష పాలిసెట్ ఏప్రిల్ 30వ తేదీన ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు జరుగుతుందని స్థానిక పాలిటెక్నికల్ కళాశాల ప్రిన్సిపల్ ఎ.మురళి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈసారి పిఠాపురం కేంద్రంగా కూడా పాలీసెట్ ప్రవేశ పరీక్షలు నిర్వహించడం జరుగుతుందన్నారు. 10వ తరగతి ఉత్తీర్ణులు అయిన వారితోపాటు ప్రస్తుతం 10వ తరగతి పరీక్షలు రాసే వారు కూడా పాలీసెట్ ప్రవేశ పరీక్షలకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. దరఖాస్తు చేసుకోవడానికి ఎస్‌సి, ఎస్‌టి అభ్యర్థులు రూ.100, బిసి, ఒసి అభ్యర్థులు రూ.400 ఫీజు చెల్లించాల్సివుంటుందన్నారు. రిజిస్ట్రేషన్ కోసం స్థానిక పిఠాపురం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో హెల్ప్ లైన్ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. దీని ద్వారా రిజిస్టర్ చేసుకుంటే ఎటువంటి ప్రాసెసింగ్ ఫీజు ఉండదన్నారు. కళాశాలలో ఈసారి పాలిటెక్నికల్ కోర్సుల్లో చేరే మొదటి సంవత్సరం విద్యార్థులకు మెస్ సౌకర్యం కల్పిస్తామని, దీంతోపాటు అనుభవజ్ఞులైన డాక్టరేట్, పోస్ట్ గ్రాడ్యుయేషన్ చేసిన అధ్యాపకులు ఉన్నారన్నారు.

ఎక్కువ మందికి ఉపాధి పనులు

ప్రజాశక్తి - పెద్దాపురం

ఎక్కువ మందికి ఉపాధి పనులు కల్పించేందుకు కృషి చేయాలని డ్వామా పీడీ అడపా వెంకటలక్ష్మి ఆదేశించారు. మంగళవారం మండలంలోని కట్టమూరులో నిర్వహిస్తున్న ఉపాధి హామీ పనులను ఆమె పరిశీలించారు. రాయన్న చెరువు ఉపాధి పనులను పరిశీలించి మస్టర్ రికార్డులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె కూలీలకు కల్పిస్తున్న ఉపాధి పనులు, వారికి వస్తున్న వేతనాలు గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆమె గ్రామంలోని గోకులం పశువుల శాలలను, నిర్మాణంలో ఉన్న సిమెంట్ రోడ్డు పనులను పరిశీలించి పలు సూచనలు చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఉపాధి పనుల్లో కూలీల సంఖ్యను పెంచేందుకు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎపిఒ డి.సుధీర్, జెఇ వి.సతీష్, టెక్నికల్ అసిస్టెంట్ కె.శ్రీనివాస్, ఫీల్డ్ అసిస్టెంట్ కె.వీరబాబు పాల్గొన్నారు.

పేరాబత్తుల విజయంపై కూటమి శ్రేణుల హర్షం

ప్రజాశక్తి - యంత్రాంగం

పట్టభద్రుల ఎంఎల్‌సి ఎన్నికల ఫలితాల్లో కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖరం విజయంసాధించడంపై టిడిపి, జనసేన, బిజెపి నాయకులు మంగళవారం హర్షం వ్యక్తంచేశారు.

మండపేట: పేరాబత్తుల రాజశేఖరం గెలుపొందటం ముమ్మాటికి ప్రజా విజయం అని రాష్ట్ర అంచనాల కమిటీ చైర్మన్, శాసన సభ్యులు వేగుళ్ళ జోగేశ్వరరావు అన్నారు. ఎ.పి అసెంబ్లి సమావేశాలలో ఉన్న ఆయన అమరావతి నుంచి మంగళవారం స్థానిక మీడియాతో ఫోన్లో మాట్లాడారు. **కొత్తపేట:** పేరాబత్తుల రాజశేఖరం విజయానికి కొత్తపేట నియోజక వర్గంలో ఎంఎల్ఎ బండారు సత్యానందరావు ఆధ్వర్యంలో పనిచేసిన పార్టీ శ్రేణులు అందరికీ అభినందనలు తెలియ జేస్తూ సంబరాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షుడు కంఠంశెట్టి శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి బూసి భాస్కరరావు, రాష్ట్ర టిడిపి ఎస్‌సి సెల్ కార్య నిర్వాహక కార్యదర్శి బీర ఇసాక్, తదితరులు పాల్గొన్నారు.

వేతనాలు పెంచాలని ఆందోళన

ప్రజాశక్తి - యానాం

రాజీవ్ గాంధీ అల్పాహార పథకం ద్వారా పలు ప్రభుత్వ పాఠశాలలో సుమారు 23 సంవత్సరాలుగా మిల్క్ బాయిలర్లుగా పనిచేస్తున్న సిబ్బందికి వేతనాలు పెంచాలని కోరుతూ స్థానిక జెండా స్థంభం వద్ద మంగళవారం ఆందోళన చేపట్టారు. పుదుచ్చేరి వ్యాప్తంగా వివిధ పాఠశాలలో పని చేస్తున్న వందలాది మంది సిబ్బంది తమకు రూ.10 వేల నుంచి రూ.18 వేలకు పెంచుతూ గత ఏడాది ప్రభుత్వం చేసిన ప్రకటన ఇప్పటికీ అమలు కాకపోవడంతో పుదుచ్చేరి వ్యాప్తంగా మిల్క్ బాయిలర్ చేపట్టిన ఆందోళన లో భాగంగా యానంలోని సిబ్బంది ఈ ఆందోళన చేపట్టారు. రూ.18 వేలు వేతనాలు పెంచకపోగా పాఠశాలలో ఉదయం నుంచి సాయంత్రం వరకు వెట్టిచాకిరీ చేయిస్తున్నారని, పెంచుతానన్న వేతనాలకు పలు నిబంధనలు పెట్టడం సరికాదన్నారు. తక్షణమే వేతనాలు పెంచి తమ సర్వీస్‌ను క్రమబద్ధకరించాలని డిమాండ్ చేశారు.

జిజిహెచ్‌లో రోగుల అవస్థలు

ప్రజాశక్తి - కాకినాడ

ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాను మూడు జిల్లాలుగా విభజన చేసి పరిపాలనా వికేంద్రీకరణ చేసినా కాకినాడ జిజిహెచ్‌ను వికేంద్రీకరణ చేయకపోవడంతో రోగులు పలు అవస్థలకు గురౌతున్నారని పౌర సంక్షేమ సంఘం కన్వీనర్ దూసర్లపూడి రమణరాజు అన్నారు. ఆసుపత్రిలో సిబ్బంది కొరతతో రోగులు ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని అన్నారు. 180 మంది ఎంఎస్‌ఒలు అవసరం కాగా, 110మంది మాత్రమే విధుల్లో ఉంటున్నారని అన్నారు. కాకినాడ జిజిహెచ్‌ను కాకినాడ జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిగా విభజించి రోగులకు సేవలు అందించాలని కోరారు.

తడి, పొడి చెత్త సేకరణపై అవగాహన

ప్రజాశక్తి - అయినవిల్లి

పంచాయతీ రాజ్ కమిషనర్ ఆదేశాల మేరకు మండల లోని విలస పంచాయతీ పరిధిలో సర్పంచ్ కుసుమ లిల్లీ మంగేష్కర్ సునీల్ ఆధ్వర్యంలో మంగళవారం తడి, పొడి చెత్త సేకరణపై అవగాహన కల్పించారు. పరిసరాల స్వచ్ఛత ప్రతి ఒక్కరి బాధ్యతగా తడి, పొడి చెత్త విడివిడిగా కేటాయించి పారిశుధ్య నిర్వహణ బండి వచ్చినప్పుడు వారికి అందజేయాలని సర్పంచ్ అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరూ పరిసరాల పరిశుభ్రత బాధ్యతగా స్వీకరించిన నాడే ఆరోగ్యవంతమైన సమాజంలో జీవించవచ్చున్నారు. ప్రధాన రహదారులతో పాటు శివారుకు వెళ్లే రహదారులు పారిశుధ్య పనులు నిర్వహించినట్లు పంచాయతీ కార్యదర్శి పి.ధనలక్ష్మి తెలిపారు. తడి, పొడి చెత్త సేకరించి డంపింగ్ యార్డులకు తరలించి సేంద్రియ ఎరువులు తయారీకి వినియోగిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో సచివాలయం సిబ్బంది పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

తడి పొడి చెత్త సేకరణ పర్యవేక్షణలో కార్యదర్శి పి.ధనలక్ష్మి

విశిష్ట గుర్తింపు సంఖ్య నమోదు తప్పనిసరి

ప్రజాశక్తి - అంబాజీపేట

రబి పంట విశిష్ట గుర్తింపును ఈ నెల 6లోగా నమోదు చేసుకోవాలని వ్యవసాయా ధికారి సిహెచ్‌డి.విజయకుమార్ తెలిపారు. ముక్కామల రైతు సేవా కేంద్రం వద్ద మంగళవారం విశిష్ట గుర్తింపు సంఖ్య నమోదుపై రైతులకు అవగాహన కల్పించారు. మండల పరిధిలో 6046 మంది రైతులకు గాను, ఇప్పటి వరకూ 4988 మంది రైతులకు నమోదు చేయడమైందన్నారు. పిఎం కిసాన్, అన్నదాత సుఖీభవ, వడ్డీ రాయితీ, పంటల బీమా, పెట్టుబడి రాయితీ, యంత్ర పరికరాలు రాయితీలు, గుర్తింపు సంఖ్య నమోదు రైతులకు మాత్రమే వర్తిస్తాయన్నారు. ఆధార్ జిరాక్స్, పట్టాదారు పాస్ బుక్ జిరాక్స్, ఆధార్‌కి అనుసంధానమైన ఫోను తీసుకుని నమోదు కానీ రైతులు రైతు సేవా కేంద్రాలలో వ్యవసాయ సహాయకులు ద్వారా చేయించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రైతులు వై.ఏసు, ఆకెళ్ళ సోమయాజులు, ఇరుసుమండ ముక్కామల, వక్కలంక, పసుపల్లి రైతులు పాల్గొన్నారు. విఎఎలు సౌజన్య, నరేంద్ర,కిరణ్ దుర్గ, విహెచ్ఎ లక్ష్మి, ఎఇఒ దుర్గారావు, జాబేజ్ శాస్త్రి, హెచ్ఇఒ వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రైతులకు అవగాహన కల్పిస్తున్న ఎఒ విజయ్ కుమార్

'సమైక్యతతోనే పార్టీకి పూర్వ వైభవం'

ప్రజాశక్తి -మామిడికుదురు

గ్రామస్థాయిలో అనుబంధ కమిటీల ఏర్పాటుతో అందరూ సమైక్యంగా పార్టీకి పూర్వ వైభవం తీసుకురావాలని పి గన్నవరం నియోజకవర్గ వైసిపి కోఆర్డినేటర్ గన్నవరపు శ్రీనివాసరావు పేర్కొన్నారు పెదపట్నం లంకలో వైసిపి మండల శాఖ అధ్యక్షుడు కొమ్ముల రాము అధ్యక్షతన మంగళవారం మాజీ సిఎం వైఎస్.జగన్ పిలుపుమేరకు రాష్ట్ర, జిల్లా, మండల,గ్రామస్థాయి అనుబంధ కమిటీల ఏర్పాటుపై మంగళవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎంఎల్ఎ పాముల రాజేశ్వరి దేవి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వము అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకువెళ్లి చైతన్య చేయాలని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెల్లి బోయిన శ్రీనివాసరావు సూచించారు. ఈ సందర్భంగా మహా కుంభ మేళా యాత్ర ముగించుకుని స్వగ్రామానికి చేరుకున్న మండల శాఖ అధ్యక్షుడు కొమ్ముల రాముకి పార్టీ శ్రేణులు శాలువా కప్పి ఘనంగా సత్కరించారు. ఈ సమావేశంలో మందపాటి కిరణ్ కుమార్, నీతిపూడి గణేష్ బాబు, ఎంపిపి కుసుమ వనజకుమారి, మండల ఎంపిటిసిల సమాఖ్య అధ్యక్షుడు నెల్లి దుర్గాప్రసాద్, తులా గోపాలకష్ణ, జిల్లాసోషల్ మీడియా అధ్యక్షులు దొమ్మేటి సత్యమోహన్, చిట్టూరి రామకష్ణ, జోగి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నాగ కిషోర్‌కు శ్రీనివాస్ పరామర్శ

ప్రజాశక్తి - అయినవిల్లి

పి.గన్నవరం నియోజకవర్గం ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు విత్తనాల నాగ కిషోర్ భార్య లోవ కుమారి గత కొంత కాలంగా అనారోగ్యసమస్యతో బాధపడుతున్నారు. ఈ విషయం తెలుసుకున్న పి.గన్నవరం వైసిపి కో ఆర్డినేటర్ (అయినవిల్లి జడ్పిటిసి సభ్యుడు) గన్నవరపు శ్రీనివాస్ మంగళవారం సిరిపల్లిలో నివాసముంటున్న విత్తనాల నాగ కిషోర్ సతీమణి లోవ కుమారిని పరామర్శించారు. శ్రీనివాస్ సిరిపల్లి సర్పంచ్ కుడిపూడి విద్యాసాగర్, పితాని వీరబాబు ఉన్నారు.

డిఎస్‌పికి ఫిర్యాదు అందజేస్తున్న జనసేన పార్టీ నాయకులు

వైసిపి ఎంఎల్‌సి 'దువ్వాడ'పై డిఎస్‌పికి ఫిర్యాదు

ప్రజాశక్తి - అమలాపురం

ఈ నెల జరిగినటువంటి రాష్ట్ర అసెంబ్లీ సమావేశాలు మొదటి రోజులో భాగంగా డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్‌పై, జనసైనికులపై వైసిపి ఎంఎల్‌సి దువ్వాడ శ్రీనివాస్ చేసిన అనుచిత వ్యాఖ్యలను మున్సిపల్ కౌన్సిలర్ గండి దేవి హారిక, నాయకులు తదితరులు ఖండించారు. వైసిపి ఎంఎల్‌సి దువ్వాడ శ్రీనివాస్ అనుచిత వ్యాఖ్యలపై అమలాపురం డిఎస్‌పికి మంగళవారం కౌన్సిలర్ గండి దేవి హారిక మంగళవారం ఫిర్యాదు చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్ పడాల శ్రీదేవి, గొల్లకోటి విజయలక్ష్మి, తిక్కా రాణి సీనియర్ నాయకులు సుధా చిన్న ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా సంయుక్త కార్యదర్శి చిక్కం భీముడు, ఉప సర్పంచ్ కంకిపాటి వీరబాబు, సఖిలే చిట్టిబాబు, తూము రమేష్, చాట్ల మంగతాయారు తదితర నాయకులు, జనసైనికులు వీర మహిళలు పాల్గొన్నారు.

రైతుల రిజిస్ట్రేషన్ పూర్తి చేయాలి

ప్రజాశక్తి - గండేపల్లి

రైతుల రిజిస్ట్రేషన్‌ను త్వరతగతిన పూర్తి చేయాలని మండల వ్యవసాయ అధికారి సద్గురుమూర్తి సూచించారు. మంగళవారం మండలం తాళ్ళూరు, జెడ్.రాగంపేట గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు రిజిస్ట్రేషన్‌లో ఇప్పటి వరకు మండలంలో 6390 నమోదు పూర్తి అయిందన్నారు. ఇంకా సుమారు 1000 చేయాల్సివుందన్నారు. రైతులు త్వరితగతిన నమోదు చేసుకోవాలని కోరారు. రైతులందరూ రబీ-24-35 పంటలో కోత అనంతరం పచ్చిరొట్ట పైరులు, అపరాలు సాగు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎఇఒ చంద్రమౌళి, విఎఎ పృథ్వీ, సురేఖ పాల్గొన్నారు.

డొక్కా సీతమ్మ క్యాంటీన్‌లో అన్నదానం

ప్రజాశక్తి - జగ్గంపేట

స్థానిక పాత పోలీస్ స్టేషన్ వద్ద జనసేనా పార్టీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న డొక్కా సీతమ్మ క్యాంటీన్‌లో మంగళవారం అన్నదానం కార్యక్రమాన్ని నిర్వహించారు. తుమ్మలపల్లి సత్యనారాయణ భూపతి చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ అన్నదానం కార్యక్రమంలో తుమ్మలపల్లి రమేష్ పాల్గొని పేదలకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో మేడిబోయిన శ్రీను, రాజనాల శ్రీను, సురపరెడ్డి నరేష్, ఎంపిటిసి సభ్యులు దొడ్డ శ్రీను, మొగిలి గంగాధర్, తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షలకు 67 మంది గైర్హాజరు

ప్రజాశక్తి - ముమ్మిడివరం

ఇంటర్ మొదటి సంవత్సరం ఇంగ్లీష్ పరీక్షకు 67 మంది గైర్హాజరయ్యారని పరీక్షల కస్టోడియన్ అధికారి డి.విజయ కుమార్ మంగళవారం తెలిపారు. రాష్ట్ర వ్యాప్త ఇంగ్లీష్ మొదటి సంవత్సరం పరీక్షకు మండలంలోని డా.మోకా గణపతి రావు ప్రభుత్వ జూనియర్ కళాశాల, తార జూనియర్ కళాశాల, డాక్టర్ బిఆర్.అంబేద్కర్ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలకు చెందిన మొత్తం 877 మంది పరీక్షలు రాయవలసి ఉండగా 810 మంది మాత్రమే పరీక్షకు హాజరయ్యారు. 67 మంది గైర్హాజరయ్యారు. డాక్టర్ ఎంజిఆర్.ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 149 మందికి 139 మంది హాజరు కాగా 10 మంది, తార కళాశాలలో 279 మందికి 261 మంది హాజరు కాగా 18 మంది, గురుకుల పాఠశాలలో 293మందికి 273 మంది హాజరు కాగా 20 మంది గైర్హాజరయ్యారు.అలాగే ఒకేషనల్ విద్యార్థులకు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జనరల్ ఫౌండేషన్ కోర్స్ పరీక్షకు 156 మందికి 137 మంది హాజరు కాగా, 19 మంది గైర్హజరైనట్లు కస్టోడియన్ తెలిపారు.

చాగల్లు, తాళ్లపూడి మండలాల్లో

చాగల్లు, తాళ్లపూడి: మండలంలో మంగళవారం నిర్వహించిన ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షలకు 12 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని ప్రిన్సిపల్ కె.పావని తెలిపారు. చాగల్లు శ్రీవెలగపూడి రామకృష్ణ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మంగళవారం ఇంటర్ మొదటి సంవత్సరం ఇంగ్లీష్ పరీక్ష జరిగిందన్నారు. దీనికి 153 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 12 మంది గైర్హాజరయ్యాన్నారు.

తాళ్లపూడిలో మంగళవారం జరిగిన ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం పరీక్షలకు 19 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని పరీక్షల ఛీఫ్ గౌరీనాథ్ తెలిపారు. మండలంలోని వేగేశ్వరపురం జూనియర్ కళాశాలలో 325 మంది విద్యార్థులు పరీక్షలు రాయాల్సి ఉండగా 306 మంది హాజరయ్యారని తెలిపారు.

వృద్ధులకు భోజనం అందజేత

ప్రజాశక్తి-రాజోలు

మలికిపురం మండలం విశ్వేశ్వరాయపురం లోని వివేకానంద ఆంగ్ల మాధ్యమ ఉన్నత పాఠశాల లో 7,9 తరగతులు చదువుతున్న విద్యార్థిని విద్యార్థులు మానవత్వం చాటారు. వారు కిడ్డీ బ్యాంక్ లో దాచుకున్న డబ్బులతో వృద్ధులకు భోజనం ఏర్పాటు చేశారు. సుమారు రూ.5 వేలు వెచ్చించి చేపల పులుసు, స్వీట్, అరటిపండు, మూడురకాల కూరలతో భోజనం స్వయంగా వడ్డించారు. ఈ సందర్భంగా అందరికీ ఆదర్శంగా నిలిచారు. ఇటువంటి సహాయం చేయుటకు ముందుకు వచ్చిన విద్యార్థులను పాఠశాల కరెస్పాండంట్ పివివి.వర ప్రసాద్ అభినందించారు. ప్రతి నెలా 4 రోజులు ఈ కార్యక్రమం నిర్వహిస్తారని ఆయన తెలిపారు. మిగిలిన తరగతుల విద్యార్థులు కూడా రానున్న రోజుల్లో వద్దులకు భోజనాలను ఏర్పాటు చేయనున్నారని అన్నారు. వీరిని ఆదర్శంగా తీసుకొని వృద్ధులకు సహాయం చేయుటకు మిగిలిన వారు ముందుకు రావాలని ప్రసాద్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు కె.లక్ష్మీ సునీత, సూర్యనారాయణ, విద్యార్థులు పాల్గొన్నారు.

సమన్వయంతోనే మెరుగైన ర్యాంకు

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం

సమన్వయంలోనే స్వచ్ఛ సర్వేక్షణ్‌లో మెరుగైన ర్యాంకును సాధించగలుగుతామని కమిషనర్ కేతన్‌గార్గ్ అన్నారు. అన్ని విభాగాధిపతులతో మంగళవారం ఆయన టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. స్వచ్ఛ భారత్ బృందం నగరానికి క్షేత్రస్థాయి పరిశీలనకు రాబోతున్నందున వార్డు ప్రత్యేకాధిపతులు, అన్ని విభాగాధిపతులు వారికి కేటాయించబడిన విధులను సక్రమంగా నిర్వహించాలని కమిషనర్ ఆదేశించారు. సిటిజన్ ఫీడ్ బ్యాక్, క్షేత్రస్థాయి అంశాల అమల్లో మార్గదర్శకాలను కచ్చితంగా పాటించాలన్నారు. సిటిజన్ ఫీడ్ బ్యాక్ అంశం కోసం నియమించిన బృందాలు మంగళవారం క్షేత్రస్థాయిలో సిటిజన్ ఫీడ్ బ్యాక్ తీసుకున్నారన్నారు. ఇప్పటివరకు 16వేల మంది నుంచి ఫీడ్ బ్యాక్ తీసుకొని రాష్ట్ర స్థాయిలో రాజమహేంద్రవరం 3వ స్థానంలో కొనసాగుతుందన్నారు. సిటిజన్ ఫీడ్ బ్యాక్ ఇంకా పెంచాల్సిన అవసరం ఉందన్నారు.

బోటు ప్రమాదాల నివారణకు చర్యలు

ప్రజాశక్తి -రాజమహేంద్రవరం రూరల్

గోదావరి నదిలో బోటు ప్రమాదాలు జరగకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలని కలెక్టర్ పి.ప్రశాంతి అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో సమన్వయ శాఖల అధికారులతో ఆమె సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నదిపై ఆధారపడి జీవిస్తునన వారికి ఎటువంటి ఆటంకం లేకుండా, అదే సమయంలో ఎందు నిమిత్తం ఆయా బోటులకు అనుమతులు ఇచ్చామో వాటిని ఉల్లంఘించకుండా ప్రామాణిక కార్యచరణ రూపొందించాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. బోటు ప్రమాదాలలో, నదీ స్నానల సందర్భంలో మరణాలు సంభవించడం దురదృష్టకరమన్నారు. ఇటువంటి ఘటనలను జరగకుండా తగిన నియంత్రణ చర్యలు చేపట్టాల్సి ఉందన్నారు. ప్రమాదం జరిగిన సందర్భం, నేపథ్యంపై సమన్వయ శాఖలు నివేదిక, భవిష్యత్తులో ఇచ్చే అనుమతుల కోసం అమలు చేయాల్సిన విధి విధానాలపై సమగ్ర నివేదిక అందించాలన్నారు. విహారం, చేపలు వేట, సరుకు రవాణా తదితర అవసరాల కోసం అనుమతులు తీసుకుంటే అలాంటి బోట్లను వాటికే వినియోగించేలా విజిలెన్స్ ఉండాలన్నారు. కంట్రోల్ రూమ్‌లు, ప్రమాద హెచ్చరికలు సూచికలు, సిసి కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు. పర్యవేక్షణ , నిబంధనల విధి విధానాలు అమల్లో భాగంగా కంట్రోల్ రూమ్‌ల సిబ్బందిని నియమించాలన్నారు. కంట్రోల్ రూమ్ సిబ్బంది బాధ్యతలు, సిబ్బందికి సామర్థ్యం వంటి వాటిపై దృష్టి పెట్టాలన్నారు. నౌకలు, పడవులు, బోట్లు నదిలోకి వెళ్లే సమయంలో అనుమతులు , ఆన్‌బోర్డ్ కార్యకలాపాల కోసం, జల మార్గాల పెట్రోలింగ్ వ్యవస్థపై సంబంధిత శాఖలు అప్రమత్తంగా వ్యవహరిస్తూ, ఆయాశాఖల నిర్దేశిత మార్గదర్శకాలు కచ్చితంగా పాటించాలని కోరారు. తగిన లైఫ్ జాకెట్లు, రక్షణ లేకుండా ఎట్టి పరిస్థితుల్లోనూ నడపడానికి అనుమతులు ఇవ్వరాదన్నారు. వాటికీ తగిన గుర్తింపు సంఖ్య లైసెన్స్ ఇవ్వాలని, వాటిని ప్రదర్శిం చాల న్నారు. డిజాస్టర్ రెస్పాన్స్ కోసం శిక్షణ, సామర్థ్యం పెంపుదల, ప్రమాదంపై ప్రతిస్పందన వ్యవస్థ సమర్థ వంతమైన పనితీరు చూపడం ముఖ్యం అన్నారు. పై అంశలపై ఆయా శాఖల అధికారులు 48 గంటల్లోకి సమగ్ర నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. సమావేశంలో టూరిజం ఇన్‌ఛార్జి ప్రాంతీయ సంచాలకులు సిహెచ్.పవన్‌కుమార్, జిల్లా టూరిజం అధికారి పి.వెంక టాచలం, జిల్లా ఇరిగేషన్ అధికారి గోపినాథ్, జిల్లా మత్స్య శాఖ అధికారి వి.కృష్ణారావు, టూరిజం సహయ మేనేజర్ గంగా రాజు, ఫైర్, పోలీస్, విపత్తుల నిర్వహణ ఇతర అధికారులు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి మహిళా దినోత్సవానికి ఏర్పాట్లు

ప్రజాశక్తి -రాజమహేంద్రవరం రూరల్

జిల్లా స్థాయి మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లూ చేయాలని కలెక్టర్ పి.ప్రశాంతి అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహణా ఏర్పాట్లపై సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ఆర్ట్స్ కాలేజీలో జిల్లా స్త్రీ శిశుసంక్షేమ శాఖ ఆధ్వర్యంలో వివిధ శాఖల అధికారుల సమన్వయంతో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలన్నారు. పోలీసు, పరిశ్రమల శాఖ, వైద్య ఆరోగ్యశాఖ, మెప్మా పీడీ, డిఆర్‌డిఎ పీడీ, స్త్రీ శిశు సంక్షేమ శాఖలు స్టాల్స్ ఏర్పా టు చేయాలని తెలిపారు. మహిళల్లో చైతన్యం కలిగించే సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఇందుకు సంబంధించి కార్యాచరణ ప్రణాళిక నివేదిక అందజేయాలన్నారు. రానున్న నాలుగు రోజుల కార్యాచరణను ప్రకటించారు. 5న సంక్షేమ హాస్టళ్ల కెరీర్ అవకాశాలు, సెల్ఫ్ డిఫెన్స్ క్లాసు, స్ట్రెస్ ఫ్రీ మేనేజ్మెంట్, బొమ్మూరులో ఇంటింటా గోడ పత్రిక అంటించాలన్నారు. 6న నర్సరీస్, ఆర్‌టిసి కాంప్లెక్స్‌లో పని చేస్తున్న మహిళలకు లేబర్ చట్టాలు అవగాహన కల్పించాలన్నారు. 7న బొమ్మూరు మహిళా ప్రాంగణంలో ఆరోగ్యశాఖ అధికారులు, ఎఎన్ఎంలు, ఆశా వర్కర్లకు మహిళా చట్టాలు, సమస్యలపై సమావేశం నిర్వహించాలన్నారు. 8న ఆర్ట్స్ కాలేజీలో మహిళా దినోత్సవ జిల్లా స్థాయి వేడుకలు నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో స్త్రీ శిశు సంక్షేమ శాఖ పీడీ కె.విజయకుమారి, జిల్లా పరిశ్రమల శాఖ డిఐఒ వణిధర్‌రామన్, అడిషనల్ ఎస్‌పి ఎన్‌బిఎం.మురళీకృష్ణ, డిఎంఅండ్‌హెచ్‌ఒ కె..వెంకటేశ్వర రావు, డిఆర్‌డిఎ పీడీ ఎన్‌వివిఎస్.మూర్తి తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రశాంతి

క్యాంపస్ సెలక్షన్లలో 65 మంది ఎంపిక

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

ఆర్ట్ కళాశలలో పీజీ విద్యార్థులకు జరిగిన శ్రీ చైతన్య స్కూల్స్ ప్రాంగణ ఎంపికల్లో ప్రాథమిక స్థాయిలో 65 మంది ఎంపికయ్యారని ప్రిన్సిపల్ డాక్టర్ రామచంద్ర తెలిపరాఉ. ఇలాంటి అవకాశాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ ఎంపికలకు శ్రీ చైతన్య విద్యా సంస్థల కో-ఆర్డినేటర్లు అరుణ్ కుమార్, కిరణ్ పాండే తదితరులు హాజరయ్యారు. జెకెసి కో-ఆర్డినేటర్ డాక్టర్ బి.హరినాథ్‌రెడ్డి, కళాశాల ఇంటర్న్‌షిప్ కో-ఆర్డినేటర్ వై.రాము, పీజీ కో-ఆర్డినేటర్ డాక్టర్ బి.మల్లికార్జున తదితరులు హాజరయ్యారు.

న్యాయం చేయాలని ఫిర్యాదు

ప్రజాశక్తి - తాళ్లరేవు

కోరంగిలో ఉన్న తన వ్యక్తిగత చేపల చెరువులో చేపలు పట్టుకుంటుంటే కొందరు అడ్డుకుంటున్నారని, వారిని నిలువరించి న్యాయం చేయాలని కోరంగి గ్రామానికి చెందిన వాసంశెట్టి సుందరేశ్వరరావు పోలీసులకు ఫిర్యాదు చేశారు. గ్రామంలో సర్వేనెంబర్ 254/ 1ఏ 3లో తనకు 2 ఎకరాల పది సెంట్లు చేపల చెరువు భూమి ఉన్నదని, ఆ చెరువును సాగు చేస్తుంటే పలువురు అడ్డుకుంటున్నారని గత నెల 18వ తేదీన పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. దీనిపై తనకు న్యాయం చేయాలని కోరారు. దీనిపై కోరంగి ఎస్ఐ పి. సత్యనారాయణ వివరణ కోరగా ఫిర్యాదు అందిందని, దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఒరిజినల్ దస్తావేజు పోయినది

సంగిత సుబ్బారావు, S/o. సంగిత నాగన్న, డో.నెం. 1-72, మెయిన్‌రోడ్డు, సంగీత హౌస్, పినపల్లె, తూర్పుగోదావరి జిల్లాలో నివసిస్తున్న నా యొక్క **ఒరిజినల్ దస్తావేజు నెం. 10447/2018, Dt. 21-9-2017,** రాజమండ్రి సబ్ రిజిష్టర్ వారి ఆఫీస్‌లో రిజిష్టర్ కాబడిన ఒరిజినల్ దస్తావేజు **ది. 25-2-2025వ తేదీన** రాజమండ్రి ప్రకాష్‌నగర్ రౌండ్ పార్కు వద్దకు జిరాక్స్ నిమిత్తం వెళ్ళుచుండగా ప్రకాష్‌నగర్ పార్క్ వద్ద పడిపోయినది. ఎవరికైన దొరికిన ఎడల ఈక్రింది అడ్రస్‌కి తెలియపర్చ వలసిందిగా కోరుచున్నాను.

సంగిత సుబ్బారావు
డో.నెం. 1-72, మెయిన్‌రోడ్డు, సంగీత హౌస్,
పినపల్లె, తూర్పుగోదావరి జిల్లా, సెల్: 98481 86463

దస్తావేజులు పోయినవి

పిఠాపురం పట్టణమునకు చెందిన శీరం నాగ సత్యనారాయణ, తండ్రి: లక్ష్మణమూర్తి గారికి పిఠాపురం సబ్ రిజిస్ట్రారు వారి ఆఫీసులో రిజిస్ట్రేషన్ అయిన దస్తావేజు నెం. 1731/2012, 3724/2014, 121/2015, 1675/2018 లు చెందియున్నవి. సదరు దస్తావేజులను ది. 20-02-2025వ తేదీన జిరాక్స్ నిమిత్తం పిఠాపురంలో మా ఇంటి నుండి చర్చి సెంటర్‌లో జిరాక్స్ షాపునకు జిరాక్స్ నిమిత్తం వెళ్ళుచుండగా దారిలో ఎక్కడో పడిపోయినది. ఎవరికైనా దొరికిన ఎడల ఈ క్రింది చిరునామాకు అందజేయగలరు.

శీరం నాగ సత్యనారాయణ
తండ్రి: లక్ష్మణమూర్తి, డో.నెం. 3-2-25, ఎం.ఆర్.పేట,
పిఠాపురం, సెల్: 73964 70999

మహారాజశ్రీ కాకినాడ 4వ అదనపు జిల్లా జడ్జి వారి కోర్టులో
O.S. 188/2017

Between:
వాది: Bathula Esther Rani
AND
7వ ప్రతివాది:
Abbireddi Janaki, W/o. Pangam Rajasekhar, D.No. 3-4-174/23/506, K.K.R. Apartments, ICICI Bank, Kantha reddy Nagar, Athapuram, Hyderabad, Telangana State.

వాది గారు ప్రతివాద్లు పయిన దావా ప్లయింటు షెడ్యూలు దాఖలా ఆస్తులను పంపకం నిమిత్తం మరియు యితర పరిహారములు నిమిత్తం దాఖలు చేసిన పై నెంబరు దావాలో పైన తెలిపిన 7వ ప్రతివాదికి ఎన్ని పర్యాయములు దావా సమన్లు పంపించినను తీసుకొనక కాలయాపన చేయుచున్నందున సదరు 7వ ప్రతివాది పై కోర్టు వారి ఎదుట **ది. 10-3-2025వ సం॥రం తేదిని పగలు గం॥ 10.30 ని॥లకు** హాజరయి ఆక్షేపణలు వున్న యెడల తెలియపర్చుకోవలెను. లేనియెడల మీ పరోక్షమందు తీర్మానించబడునని యిందు మూలంగా తెలియపర్చడమయినది.

కాకినాడ **అల్తాఫ్ మహమ్మద్**
3-3-2025 వాది తరపు అడ్వకేటు

మహారాజశ్రీ 2వ అడిషినల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టు, రాజమహేంద్రవరం
O.S. No. 155/2024

Between:
Medisetti Venkateswara Apparao, S/o. Venkata Ramana, Hindu, aged 58 years, Business, Resident of Door No. 12-11-18/A, Dammuvari Street, Aryapuram, Rajamahendravaram, East Godavari District, A.P. ***...Plaintiff***
AND
1. Naidu Srinivasa Rao, S/o. Krishna murthy, Hindu, aged 46 years, Business, Door No. 20-22-45, 6th Street, Ramachandrarao peta, Tumalava, Rajamahendravaram, East Godavari District.
2. Naidu Naga Lakshmi, W/o. SrinivasaRao, Hindu, aged 41 years, House wife, Door No. 20-22-45, 6th Street, Ramachandrarao peta, Tumalava, Rajamahendravaram, East Godavari District.

...Defendants

పై నెంబరు దావాలో 1, 2 ప్రతివాదులు అయిన మీకు కోర్టు ద్వారా ఎన్నిసార్లు సమన్లు/ నోటీసులు పంపినా మీరు వాటిని తీసుకోకుండా ఉద్దేశ్యపూర్వకంగా త్రిప్పి వేయుచున్నారు. కావున **ది. 25-3-2025 సం॥రం తేదీ ఉదయం 10.30 ని॥లకు** మీరు స్వయంగా గాని, లేదా ప్లీడరు ద్వారా గాని పై కోర్టు వారి ఎదుట హాజరు అయ్యి సదరు పై దావాలో మీ ఆక్షేపణలను తెలుపుకొనవలెను. లేనియెడల సదరు దావాను మీకు పరోక్షముగా శ్రీ కోర్టు వారు తీర్మానించెదరు.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)

రాజమండ్రి **జి.అప్పారావు**
04-3-2025 అడ్వకేట్, రాజమండ్రి